అమీర్‌పేటలోని 3 హెచ్‌ఎండీఏ భవనాలను అద్దెకు ఇస్తున్నట్లు బోర్డును ఏర్పాటు చేసిన అధికారులు

అద్దెకు హెచ్‌ఎండీఏ భవనాలు

అమీర్‌పేటలో మైత్రివనం భవనం ఆధునీకరణ

సిటీబ్యూరో, ఏప్రిల్ 20(నమస్తే తెలంగాణ): నగరంలోనే అత్యంత కీలక ప్రాంతమైన అమీర్‌పేటలోని హెచ్‌ఎండీఏకు చెందిన ఖాళీ స్థలాలతో పాటు భారీ బహుళ అంతస్థుల వ్యాపారాలు ఉన్నాయి. మైత్రివనం, మైత్రి విహార్‌తో పాటు స్వర్ణ జయంతి కమర్షియల్ కాంపెక్స్ పేరుతో మూడు వ్యాపార భవనాలున్నాయి. ఈ భవనాలన్నీ వ్యాపార కార్యకలాపాలకే హెచ్‌ఎండీఏ అద్దెకు ఇస్తోంది. ప్రభుత్వానికి మంచి ఆదాయ వనరుగా ఉన్న ఈ భవనాలను ఆధునీకరించి, మరింత ఆదాయాన్ని పెంచుకునే చర్యలు అధికారులు చేపట్టారు. అందులో భాగంగా మొదట అమీర్‌పేట లోని మైత్రివనం, స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్సులను ఆధునీకరించేందుకు సుమారు రూ.85 లక్షలు ఖర్చు చేశారు. ఎంతో రద్దీగా ఉండే అమీర్‌పేటలోని ఈ భవనాల్లో వ్యాపార కార్యకలాపాలు సాఫీగా నిర్వహించేందుకు వీలుగా భవనాల చుట్టూ పార్కింగ్ ప్రాంతాలను, డ్రైనేజీ లైన్‌లను పునరుద్ధరించడం, వర్షపు నీరు నిలిచే చోటుకు మరమ్మతు పనులు పూర్తి చేసి అద్దెకు ఇచ్చేందుకు అనుకూలంగా హెచ్‌ఎండీఏ ఇంజనీరింగ్ విభాగం తీర్చిదిద్దింది.

ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్

ఎంజీబీఎస్‌లో మూడు రోజుల ఓటరు అవగాహనపై ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభం

సుల్తాన్ బజార్, ఏప్రిల్ 20: ఓటు హక్కు మన బాధ్యత, ప్రతి ఒక్కరు ఈ హక్కును సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ అన్నారు. ఈ మేరకు శనివారం మహాత్మా గాంధీ బస్ స్టేషన్ ఆవరణలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఓటర్లకు అవగాహన పెంచేలా ఫొటో ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. మూడు రోజుల పాటు కొనసాగే ఈ ఎగ్జిబిషన్‌ను ఆయన టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్, జాయింట్ సీఈవో సర్ఫరాజ్ అహ్మద్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఓటరు ఆన్‌లైన్ మాధ్యమం ద్వారా తమ ఓటు ఉందో..? లేదో? పరిశీలించుకోవాలన్నారు. పోలింగ్ సెంటర్ చెక్ చేసుకొని ఎన్నికల సంఘం సూచించిన 12 గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. మనల్ని ఎవరు పాలించాలో మనమే ఎన్నుకునే అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని మీ ప్రాంతాన్ని ఎవరు అభివృద్ధి చేస్తారో వారికి ఓటు వేసేందుకు ఐనా తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ, ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన పెంచేందుకు సీఈవో వికాస్ రాజ్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎంజీబీఎస్‌లో ఈ ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎంజీబీఎస్ నుంచి నిత్యం లక్ష మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తారని అన్నారు. ఓటింగ్ శాతం పెరిగేలా అందరు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రజా స్వామ్యాన్ని కాపాడేందుకు యువత ముందుకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీఎస్ఆర్టీసీ రంగారెడ్డి రీజియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కిమ్స్ ఆసుపత్రిలో జాతీయ స్థాయి సదస్సులో మాట్లాడుతున్న వైద్యులు

రుమటాలజీ సమస్యలకు కొత్త తరహా చికిత్సలెన్నో..

కిమ్స్‌లో రుమటాలజీపై జాతీయ సదస్సు

బేగంపేట్, ఏప్రిల్ 20: ఆర్థరైటీస్, ఆస్టియో ఆర్థరైటీస్, లూపస్, ఆటో ఇమ్యూన్ వ్యాధులు రుమటాలజీ సమస్యలకు ప్రపంచ వ్యాప్తంగా అనేక కొత్త రకాల చికిత్సా పద్ధతులు అందుబాటులోకి వస్తున్నాయని కిమ్స్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ భాస్కర్ రావు అన్నారు. వీటి గురించి రుమటాలజిస్ట్‌లు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ రోగులకు సాంత్వన కలిగించేందుకు ప్రయత్నిస్తున్నారని భాస్కర్ రావు అన్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో శనివారం రెండు రోజుల పాటు జరిగే క్లినికల్ రుమటాలజీ కాన్ఫరెన్స్ – 2024 ఆయన ప్రారంభించారు. ఇండియన్ రుమటాలజీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్, పాండిచ్చేరి జిప్‌మర్ రుమటాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ మోలీథాబా సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రి రుమటాలజీ విభాగం క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ శరత్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ, దేశంలో రుమటాలజీ రంగాన్ని అభివృద్ధి చేయడానికి క్లినికల్ రుమటాలజీ సదస్సు 2024 ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సదస్సులో భారత దేశం నలు మూలల నుంచి పరిష్కరించిన సుమారు 260 కేసుల సారాంశాలను పరిశీలించినట్టు వారు తెలిపారు.

వ్యవసాయ అభివృద్ధిలో యువతకు ఉచిత శిక్షణ

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 20: వ్యవసాయ భూమిని అభివృద్ధిని చేసుకునేందుకు ఆధునీకరణ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలనే ఉద్దేశంతో యువతకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు సెంటర్ ఫర్ ఎంటర్ ప్రెన్యూర్షిప్ డెవలప్‌మెంట్ (సీఈడీ) నోడల్ ఆఫీసర్ పావని ప్రియాంక శనివారం తెలిపారు. అగ్రి క్లినిక్, అగ్రి వ్యాపారంపై 45 రోజుల పాటు కూకట్‌పల్లిలోని సీఈడీ సంస్థలో ఉచితంగా శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందన్నారు. భోజన సదుపాయం ఉంటుందని, కనీస విద్యా అర్హత డిప్లమా, డిగ్రీ, పీజీ, బీఎస్సీ(బీజెడ్‌సీ), పోస్ట్ గ్రాడ్యుయేషన్, అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్ తదితర కోర్సులు పూర్తిచేసి తెలంగాణ ప్రాంతానికి చెందినవారై ఉండాలన్నారు. ఈ నెల 30వ తేదీలోపు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతుందని, ఆసక్తి గల అభ్యర్థులు ఫోన్ నం: 70366 66425ను సంప్రదించాలని కోరారు.

స్వచ్ఛతే లక్ష్యంగా కార్యాచరణ

పలు ప్రాంతాల్లో బస్తీ కార్యాచరణను నిర్వహిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

సిటీబ్యూరో, ఏప్రిల్ 20(నమస్తే తెలంగాణ): స్వచ్ఛ హైదరాబాద్ లక్ష్యంగా గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో బస్తీ కార్యాచరణను ప్రత్యేకంగా అమలు చేస్తున్నారు. మహానగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు బస్తీ స్థాయి నుంచే పారిశుద్ధ్య సిబ్బంది సమర్థవంతంగా పనిచేసేలా బస్తీ కార్యాచరణను వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలతో నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు చెత్త సేకరణ 100 శాతం జరిగేలా ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి 100 శాతం చెత్త సేకరణ చేసేలా పారిశుద్ధ్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నారు. బస్తీల్లో ర్యాలీలు నిర్వహించడం, అవగాహన కార్యక్రమాలు, రంగోళి, టౌన్ వెండింగ్ కమిటీ మీటింగ్, వారాంతంలో చెత్త సేకరణపై ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించామని జీహెచ్‌ఎంసీ అధికారులు తెలిపారు. శనివారం నాటికి 1696 మీటింగులను బస్తీల్లో నిర్వహించి, చెత్త సేకరణకు సంబంధించిన అంశాలను స్వయం సహాయక సంఘాల సభ్యులతో పాటు ఆటోల డ్రైవర్లు, ఇతర సిబ్బందికి వివరించారు. బస్తీ కార్యక్రమంలో 6225 మంది ప్రజలు పాల్గొనగా, ఆ 1203 చోట్ల రంగోళి కార్యక్రమాన్ని స్థానిక ప్రజల భాగస్వామ్యంతో చేపట్టామని అధికారులు తెలిపారు.

ముగిసిన టెక్నోస్మానియా వేడుక

పలు విభాగాలలో క్విజ్, డిబేట్, దాండియా పోటీలు

యూరో మెడికేర్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ రాజమౌళిని సన్మానిస్తున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 20: ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న టెక్నోస్మానియా 2024 వేడుకలు శనివారంతో ముగిసాయి. ఈ వేడుకలలో భాగంగా గురువారం పలు విభాగాలలో పోటీలు నిర్వహించారు. జనరల్ క్విజ్, డిబేట్, దాండియా తదితర అంశాలలో పోటీలు జరిగాయి. 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ గ్రీన్ ఫార్మా' అనే అంశంపై యూరో మెడికేర్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ రాజమౌళి, 'రీసెంట్ ఇన్నోవేషన్స్ ఇన్ ప్రాసెస్ ఇంజినీరింగ్ అండ్ న్యూట్రిషన్ ఆఫ్ ఫుడ్' అనే అంశంపై ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ సంజయ్ ఠాకూర్‌లు అతిథి ఉపన్యాసాలు వెలువరించారు. అనంతరం, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. టెక్నోస్మానియా 2024 సందర్భంగా వివిధ అంశాలలో జరిగిన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ వేడుకల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఓఎస్డీ టు వీసీ ప్రొఫెసర్ రెడ్యానాయక్, బాలనటి అహన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్యానాయక్ మాట్లాడుతూ ఫుడ్ టెక్నాలజీ, కెమికల్ టెక్నాలజీ, టెక్స్‌టైల్ టెక్నాలజీ వంటి విలువైన కోర్సులున్న ఈ కళాశాల ఎంతో గొప్పదన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగం సాధించడం అంత సులువు కాదని చెప్పారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మిషీన్ లెర్నింగ్ వంటి కోర్సులు వచ్చి ఎన్నో మార్పులు తీసుకువచ్చాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింత సాయిలు, టెక్నోస్మానియా కన్వీనర్ ప్రొఫెసర్ శ్రీనునాయక్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రమేశ్‌కుమార్, ప్రొఫెసర్లు బసవరావు, రాజం, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు డాక్టర్ ఏ. పరుశురాం, డాక్టర్ పరమేశ్వర్లు, డాక్టర్ సాదం ఐలయ్య, డాక్టర్ వి.భాస్కర్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ అనిత, డాక్టర్ కవిత, డాక్టర్ ధీరజ్, రేణు, స్టూడెంట్ కోఆర్డినేటర్లు రేగ శ్యాంసుందర్, మాధవి, ఆకాశ్, అఖిల, ముఖేశ్, సాహిత్య, సూరిదుర్గ, అరవింద్ పాల్గొన్నారు.

వారసత్వ సంపద ఔన్నత్యాన్ని తెలుసుకోవాలి

డెక్కన్ హెరిటేజ్ అకాడమి ట్రస్ట్ చైర్మన్ మణికొండ వేద కుమార్

బన్సీలాల్‌పేట్‌లోని మెట్లబావి వద్ద 'వాయిస్ ఆఫ్ హెరిటేజ్ బ్యాడ్జ్' లో పాల్గొన్న సభ్యులు

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 20: భారతీయ సంస్కృతిలో భాగమైన పురాతన వారసత్వ సంపద, నీటి సంరక్షణ కోసం నిర్మించిన బావులు, అద్భుత నిర్మాణ శైలి కలిగిన పురాతన కట్టడాల ఔన్నత్యాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని డెక్కన్ హెరిటేజ్ అకాడమి ట్రస్ట్ చైర్మన్ మణికొండ వేద కుమార్ అన్నారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా ఐకోమాస్, డెక్కన్ హెరిటేజ్ అకాడమీల సంయుక్త ఆధ్వర్యంలో బన్సీలాల్‌పేట్‌లోని మెట్ల బావి వద్ద శనివారం ఉదయం అర్కిటెక్చర్ విద్యార్థులతో కలిసి 'వాయిస్ ఆఫ్ హెరిటేజ్ బ్యాడ్జ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐకోమాస్ ఇండియా సౌత్ జోన్ ప్రతినిధి, ప్రముఖ అర్కిటెక్ట్ జీవీఎస్ సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ, చారిత్రాత్మక కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని అన్నారు. బన్సీలాల్‌పేట్‌లోని పురాతన మెట్లబావిని రెయిన్ వాటర్ ప్రాజెక్ట్స్, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ సంయుక్తంగా ఎంతో శ్రమించి పునరుద్ధరించడం వలన పరిసరాలలో భూగర్భ జలాలు వృద్ధి చెందాయని, దీనిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడం జరిగిందని తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ కాలేజీ, జేబీఆర్ ఆర్కిటెక్చర్ కాలేజి, శ్రీవెంకటేశ్వర ఆర్కిటెక్చర్ కాలేజీలకు చెందిన విద్యార్థులకు మెట్లబావి పరిసరాలు, కట్టడాల ప్రత్యేకతలను వివరించారు. చార్మినార్, చౌమహల్లా ప్యాలెస్, సాలార్‌జంగ్ మ్యూజియంలను సందర్శించడం జరిగిందని, త్వరలో హస్మత్‌గంజ్‌లోని బ్రిటిషు గేట్, కోఠి మహిళా కళాశాలలోని బ్రిటిషు రెసిడెన్సీ భవనాలను కూడా విద్యార్థులకు చూపిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పురావస్తు శాఖ మాజీ డైరెక్టర్ తాహెర్, కన్సర్వేటివ్ ఆర్కిటెక్ట్‌లు డాక్టర్ వసంత శోభ, ఆర్.ఇందిర, శోభాసింగ్, ఫోరం ఫర్ బెటర్ హైద్రాబాద్ సభ్యులు, కమ్యూనిటీ వలంటీర్ సీమలు పాల్గొన్నారు.

డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న అధికారులు

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 20: డిజిటల్ అక్షరాస్యతపై సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ), డిజిటల్ లిటరసీ టూ సెక్యూర్ యూత్ (దిల్‌సే) సహకారంతో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి మార్గదర్శకత్వంలో అవగాహన సదస్సు నిర్వహించారు. శంషాబాద్ చేగూర్‌లోని కన్హా హార్ట్‌ఫుల్ లెర్నింగ్ సెంటర్‌లో పదో తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన యువతకు భద్రత కల్పించే డిజిటల్ అక్షరాస్యతపై సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పిల్లలపై, యువకులపై సోషల్ మీడియా ప్రభావం, విద్యార్థులు 1930 లేదా సైబర్ క్రైమ్.జీఓవీ.ఇన్ పోర్టల్‌కు కాల్ చేయడం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ (క్రైమ్స్) కె.నరసింహ, సైబర్ క్రైమ్స్ ఏసీపీలు బి.రవీందర్ రెడ్డి, చంద్రకాంత్, ఇన్‌స్పెక్టర్లు కె.శ్రీనివాస్, డి.అజయ్ కుమార్, సీఎస్ సీనియర్ మేనేజర్ వై.భానుమూర్తి, దిల్‌సే వాలంటీర్లు పాల్గొన్నారు.

JOS ALUKKAS
A TRADITION OF FINE JEWELLERY

జోస్ అలుక్కాస్‌లో 28 వరకు చైన్, గాజుల ఉత్సవం

ఆభరణాల తరుగు ఛార్జీలపై 50 శాతం తగ్గింపు

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 20: జోస్ అలుక్కాస్ షో రూమ్‌లలో ఏప్రిల్ 28వ తేదీ వరకు చైన్, గాజుల ఉత్సవంలో భాగంగా ఆభరణాల తరుగు ఛార్జీలపై 50 శాతం తగ్గింపు ఇస్తున్నదని, దీంతో పాటు ఎక్స్‌ఛేంజ్ ఫెయిర్ ఆఫర్ అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో వినియోగదారుల పాత బంగారాన్ని కొత్త హెచ్‌యూఐడీ బంగారు ఆభరణాలకు మార్చిడి చేసుకోవచ్చన్నారు. వినియోగదారులు ధరలో లేదా బరువులో ఎలాంటి నష్టం లేకుండా కొత్త డిజైన్ల కోసం 22 క్యారెట్ల బంగారు ఆభరణాలను మార్చుకోవచ్చని, అదనంగా జోస్ అలుక్కాస్ వజ్రాల ఎక్స్‌ఛేంజ్ ప్రయోజనాన్ని పొందవచ్చన్నారు. అక్షయ తృతీయ అడ్వాన్స్ బుకింగులను ప్రారంభించినట్లు, ఇందులో కొనుగోళ్ళపై వినియోగదారులకు ఉచితంగా బంగారు నాణేలను బహుమతిగా ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

కేంద్రంలో హాజరుపై విచారిస్తున్న నోడల్ ఆఫీసర్ ఫర్ మ్యాన్ పవర్ ట్రైనింగ్, డీసీ వంశీకృష్ణ

ఎన్నికల శిక్షణకు 285 మంది గైర్హాజరు

వారిపై చర్యలకు రంగం సిద్ధం

ఎఫ్ఐఆర్ నమోదుకు జిల్లా అధికారుల ప్రయత్నాలు

405 మందికి హాజరైంది 72 మందే..

మియాపూర్ , ఏప్రిల్ 20: వచ్చే నెల 13వ తేదీన జరగనున్న పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సిబ్బందికి శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. ఈ మేరకు పీవో, ఏపీవోలకు తొలి దశ శిక్షణ పూర్తవగా, ఓపీవోలకు శిక్షణను అందిస్తున్నారు. శనివారం ఇక్కడి శ్రీవెంకటేశ్వర ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో తొలి దశ శిక్షణ కార్యక్రమానికి 405 మంది ఓపీవోలకు గాను కేవలం 72 మంది మాత్రమే హాజరయ్యారు. వారం రోజుల క్రితం ఇక్కడి చందానగర్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఓపీవోల శిక్షణకు సైతం పూర్తి స్థాయిలో హాజరు కాలేదు. దీంతో శనివారం మరోమారు శిక్షణకు పిలుపునివ్వగా, 72 మంది మాత్రమే హాజరయ్యారు. ఇందులో ఇండియన్ ఇమ్యూనోలాజికల్ సంస్థకు చెందిన 295 మంది సిబ్బందికి ఓపీవో విధులకు హాజరయ్యేందుకు ఎన్నికల అధికారులు లిఖిత పూర్వక ఆదేశాలు పంపారు. ఆ సంస్థ నుంచి గరిష్టంగా ఎనిమిది మంది మాత్రమే హాజరయ్యారు. తద్వారా ఒకే ప్రభుత్వ రంగ సంస్థకు చెందిన 285 వరకు విధులకు హాజరు కాలేదు. ఇక్కడి శిక్షణ కేంద్రం అధికారుల ద్వారా సమాచారం తెలుసుకున్న జిల్లా ఎన్నికల అధికారులు వారందరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయించే ఆలోచనలో ఉన్నారు. ఈ మేరకు పోలీసు అధికారులతో సంప్రదింపులు సైతం జరిపినట్లు తెలిసింది. కాగా, గైర్హాజరైన మిగిలిన సిబ్బందిపైనా చర్యలకు సిద్ధం అవుతున్నారు. శనివారం ఇక్కడ నిర్వహించిన ఓపీవోల శిక్షణలో ఆర్‌పీలు ఎన్నికల విధుల నిర్వహణపై అవగాహన కల్పించారు.

రాష్ట్ర వ్యాప్తంగా 29 కేంద్రాల్లో శిక్షణ

మూడువేల మంది పిల్లలకు పైగా ఉచిత కోచింగ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న వేసవి శిక్షణ శిబిరాలు శనివారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 29 కేంద్రాల్లో వివిధ వయసు విభాగాల్లో పిల్లలకు క్రికెట్ శిక్షణ అందించనున్నారు. నగరంలోని లాలాపేట సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి దేవరాజ్, కోశాధికారి శ్రీనివాస్, కౌన్సిలర్ సునీల్ అగర్వాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, 'రెండు దశాబ్దాల్లో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర వ్యాప్తంగా వేసవి శిబిరాలు ప్రారంభించాం. సమ్మర్ క్యాంప్‌లకు మంచి స్పందన వచ్చింది. ఇందులో ప్రతిభ చాటిన వారికి లీగ్స్‌లో ఆడే అవకాశం కల్పిస్తాం. ప్రస్తుతం నిర్వహిస్తున్న 29 కేంద్రాల్లో ఉన్నత ప్రమాణాలు కల్గిన వాటిని హెచ్‌సీఏ అకాడమీలుగా మార్చే ఆలోచన ఉంది. ఈ శిబిరాల్లో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్లు అందజేస్తాం' అని అన్నారు.

జూబ్లీహిల్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యలు వివరిస్తున్న బ్రాహ్మణ సంక్షేమ వేదిక నేతలు

బ్రాహ్మణుల పథకాలను పునరుద్ధరించాలి

సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన సంఘాలు

బంజారాహిల్స్, ఏప్రిల్ 20: గత ప్రభుత్వంలో బ్రాహ్మణుల సంక్షేమ కోసం చేపట్టిన పథకాలను, కార్యక్రమాలను పునరుద్ధరించి బ్రాహ్మణ కులస్తులను ఆదుకోవాలని బాహ్మణ సంక్షేమ వేదిక నేతలు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసానికి శనివారం వచ్చిన వేదిక నేతలు మాట్లాడుతూ, పౌరోహిత్యాన్ని వృత్తిగా గుర్తించాలని, పేద బ్రాహ్మణులకు ఆర్థిక సాయం చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన బ్రాహ్మణ పరిషత్‌ను పునరుద్ధరించి బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. ఇటీవల అకారణంగా బ్రాహ్మణులపై దాడులు జరుగుతున్నాయని, వాటిని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన సీఎం తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు బ్రాహ్మణ సంక్షేమ వేదిక సభ్యులు చొప్పకట్ల రాము, పావనీ శర్మ, నేరెళ్ల మల్లికార్జున్, ఫణీంద్ర, రాఘవ శర్మ, శ్రీనివాసులు, ఉజ్వల కుమారి, రమణి, సుబ్రమణ్య శర్మ పాల్గొన్నారు.

గుండు గీయించినా..మీసం తీసినా..

'ఫేస్ రికగ్నిషన్'తో పారిశుధ్య కార్మికులకు తిప్పలు

ఫేస్ రికగ్నియేషన్‌తో హాజరుపై ట్రయల్ రన్(ఫైల్)

మియాపూర్ , ఏప్రిల్ 20: పారిశుధ్య విభాగంలో హాజరు విషయంలో అవకతవకలకు చెక్ పెట్టేందుకు అందుబాటులోకి తెచ్చిన 'ఫేస్ రికగ్నిషన్' యాప్‌తో కార్మికులు తిప్పలు పడుతున్నారు. గుండు గీయించినా..మీసం తీసినా.. సదరు యాప్ (రిజిస్ట్రేషన్ సమయంలో నమోదైన ఫొటోతో సరిపోలక) స్వీకరిస్తలేదు. దీంతో కార్మికుల హాజరు పడటం లేదు. ఈనెల 1 నుంచి అన్ని సర్కిళ్లలో ఫేస్ రికగ్నిషన్ విధానాన్నిపూర్తిస్థాయిలో ఆచరణలోకి తీసుకొచ్చారు. ఎస్ఎఫ్ఏలకు వారి సెల్‌ఫోన్లలో ఫేస్ రికగ్నియేషన్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేశారు. రిజిస్ట్రేషన్ సమయంలో కార్మికులందరీ ఫొటోలతో పాటు ఇతర వివరాలను అందులో నిక్షిప్తం చేశారు. ఇదిలా ఉంటే మియాపూర్ డివిజన్‌లో ఓ కార్మికుడి తన తండ్రి మృతి చెందడంతో....సంప్రదాయం ప్రకారం గుండు చేయించుకున్నాడు. ఈ మార్పు కారణంగా విధులకు హాజరైన సమయంలో సదరు కార్మికుడి ఫేస్ రికగ్నియేషన్ గుర్తించకపోవడంతో హాజరు నమోదు కాలేదు. మూడు రోజులుగా అతడిది ఇదే పరిస్థితి. మాదాపూర్ డివిజన్‌కు చెందిన ఓ కార్మికుడు దైవ దర్శనం సందర్భంగా గుండు... మీసం తీయించాడు. మరుసటి రోజున విధులకు రాగా, అతడికి సైతం ఇలాంటి సమస్యే ఎదురైంది. మిగిలిన సర్కిళ్లలోనూ సాంకేతిక ఇబ్బందులతో కొందరికి హాజరు పడటం లేదన్న ఫిర్యాదులు ఉన్నతాధికారులకు అందుతున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి మళ్లీ సదరు కార్మికుల 'ఫేస్ రికగ్నియేషన్'లో నమోదు చేసేలా చూస్తున్నారు. జుట్టు ... మీసం పెరిగిన తర్వాత.. మళ్లీ ఫొటోలను నిక్షిప్తం చేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. యాప్ కొత్తది కావడంతో కొంత సాంకేతిక సమస్యలు వస్తున్నా... వాటికి పరిష్కార మార్గాలను అన్వేషించి అమలు చేస్తున్నట్లు చెబుతున్నారు. మరోవైపు బృందంలోని ఒక కార్మికుడు ఒక రోజు ముందస్తు సమాచారం లేకుండా విధులకు ఎగనామం పెట్టినా.. ఆ బృందంలోని మిగిలిన కార్మికులందరికీ హాజరు నిలిచిపోతున్నది.